క్లుప్తంగా

అ'పూర్వ' సమ్మేళనం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురం నగర పాలక ఉన్నత పాఠశాలకు చెందిన 1995–96 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. మైపాడుగేట్ సెంటర్‌లోని కేవీఆర్ కల్యాణ మండపంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు పాల్గొని గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన హెచ్‌ఎం, అభినవ ఘంటసాల పాటూరు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, భరత్‌కృష్ణారెడ్డి, శారాను ఘనంగా సత్కరించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 52 మంది హాజరు



నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్ కౌన్సెలింగ్‌ను సోమవారం నిర్వహించారు. వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన కౌన్సెలింగ్‌కు మొత్తం 52 మంది విద్యార్థులు హాజరయ్యారు. అధికారులు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ర్యాంకులు అందజేశారు. పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రక్రియను టెక్నికల్ విద్య ఆర్జేడీ నిర్మల్ కుమార్ పరిశీలించారు. కౌన్సెలింగ్ కన్వీనర్‌గా ప్రభుత్వ బాలురు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రావు వ్యవహరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు..నవాబుపేటలోని చుండూరువారివీధిలో శ్రీరామమూర్తి(62) నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, రమేష్, రాజేష్ కుమారులు ఉన్నారు. ఆయన నవాబుపేట సెంటర్‌లో కిళ్లీ షాపు నిర్వహిస్తున్నారు. ఆయన మూడేళ్లుగా గుండె, శ్వాసకోశ వ్యాధులతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా ఆరోగ్యం మెరుగుపడలేదు. ఇటీవల వైద్యులు పనిచేయొద్దని సూచించారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీరామమూర్తి ఈ నెల 22న సాయంత్రం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన్ని కుటుంబ సభ్యులు తొలుత రామచంద్రారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అనంతరం అపోలో ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి పెద్దకుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు నవాబుపేట ఎస్సై కే తిరుపతయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్లకు వందనం



నెల్లూరు రూరల్: నగరంలోని రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రూరల్ పరిధిలోని 18 పంచాయతీల్లో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేసి సత్కరించారు. రూరల్ ఎంపీపీ బూడిద విజయకుమార్ మాట్లాడుతూ ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. విజయ డైయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలైంద్రకుమార్, ప్రజాప్రతినిధులు, మండలాధికారులు పాల్గొన్నారు.

వస్త్రదానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, షేక్ అలియా, తదితరులు పాల్గొన్నారు.

బాబువి మోసపూరిత హామీలు

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు మహానాడులో ఆయన విగ్రహానికే దండలు వేసి అక్కడి నుంచే మేనిఫెస్టోను విడుదల చేసి మళ్లీ మోసపూరిత హామీలతో ప్రజల ముందుకొస్తున్నారని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 9వ డివిజన్ రామకృష్ణానగర్, ఎఫ్‌సీఐ కాలనీ, ఎక్స్‌టెన్షన్, ఎన్‌సీ బాలయ్యనగర్, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించాలన్నారు. ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు తూచ తప్పకుండా మేనిఫెస్టోను అమలు చేసిన వాడే నాయకుడన్నారు. 2014లో అబద్ధపు హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసి అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ వెబ్‌సైట్ నుంచి దాన్ని తొలగించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎన్నికలకు ముందు రెండు పేజీల మేనిఫెస్టోను విడుదల చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. తెలుగు జాతి గౌరవాన్ని నిలబెట్టిన మహనీయుడు దివంగత నందమూరి తారక రామారావును మానసిక క్షోభకు గురిచేసి చెప్పులతో కొట్టించిన వ్యక్తికి ఇంకా ఎన్టీఆర్ అభిమానులు ఓట్లు వేయాలని చూస్తున్నారంటే మీరు నిజమైన అభిమానులా... కాదా అని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబుకు బుద్ధి చెప్పే ఒకే ఒక్క మగాడు ఈ రాష్ట్రంలో ఎవరైనా ఉన్నారంటే అది సీఎం వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు ఓట్లు వేస్తారా.. ఒక్క మగాడు జగనన్నకు ఓట్లు వేస్తారా.. అనే విషయం ఎన్టీఆర్ అభిమానులే ఆలోచించుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, డివిజన్ ఇన్‌చార్జి వంగాల శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణికి సన్మానం



మంత్రి కాకాణిని సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. రోగులకు అంకితభావంతో సేవలందించే డా.గంగాధర్‌ను జిల్లా సర్వజన వైద్యశాలకు బదిలీ చేయించడంపై, అప్కాస్ ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు చొరవచూపడంపై మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. 2019 అక్టోబర్ నుంచి మూడు నెలలు సెక్యూరిటీ సిబ్బందికి రావాల్సిన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ గంగాధర్, యూనియన్ నాయకులు శ్రీనివాసులు, సందానిబాషా, జబ్బార్, విజయ్‌కుమార్ ,రాజీవ్‌రెడ్డి, మోహన్‌రాజు, రమేష్‌రాజు, ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదలను అవమానించడం దారుణం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి, యువజన నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వం పేదలకు ఇచ్చిన నివేశన స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చి వారిని టీడీపీ నాయకులు అవమానించడం దారుణమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగరాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జీపీ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. టీడీపీ వైఖరికి నిరసనగా నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో నగరంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజన్న భవన్ నుంచి ఆత్మకూరు బస్టాండ్, గాంధీబొమ్మ సెంటర్, వీఆర్సీ సెంటర్, రామలింగాపురం మీదుగా బైక్ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ సీఎం వైఎస్ జగన్ పేద అక్కచెల్లెమ్మలకు ఆస్తిని అందించేందుకు నివేశన స్థలాలను పంపిణీ చేశారని తెలిపారు. ఈ స్థలాలు శవాలను పూడ్చి పెట్టేందుకు సరిపోవని మాట్లాడి చంద్రబాబు, టీడీపీ శ్రేణులు పేదలను అవమానించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యువజన, విద్యార్థి విభాగ నాయకులు సాకేష్‌రెడ్డి, పుష్పసాయి, రేవంత్, హంసా, లోకేష్, కిషోర్, ఆనంద్, సన్నీ, తౌఫిక్, ఫారూక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని కిసాన్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్–2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మైపాడు రోడ్డు విస్తరణలో భాగంగా 11కేవీ పెన్నార్ విద్యుత్‌ఫీడర్ పరిధిలో నూతన విద్యుత్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కారణంగా జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్ నగర్, సింహపురికాలనీ, మైపాడుగేట్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జక్కా వెంకయ్యకు ఘన నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రముఖ సీపీఎం నాయకుడు స్వర్గీయ జక్కా వెంకయ్య ఐదో వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని 47,48 డివిజన్‌లలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. 16వ డివిజన్‌లో జక్కా వెంకయ్య కుటుంబసభ్యులతో కలిసి పుచ్చకాయలు పంపిణీ చేశారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో అనేక ఉద్యమాలు చేపట్టిన ఘనత జక్కా వెంకయ్యకే దక్కుతుందన్నారు. సీపీఎం నాయకులు చంద్రారెడ్డి, కాయం శ్రీనివాసులు, కొండయ్య, చిన్నయ్య, రామారావు, సుబ్బరాయుడు, మల్లి, తిరుమల, ఆటో యూనియన్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలి



స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందనకు వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి 36 అర్జీలు రాగా పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి 13 ఫిర్యాదులు అందగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్పందన అర్జీలను తగ్గించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నగర పాలక సంస్థలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహ వాహనంపై చాముండేశ్వరిదేవి



ఇందుకూరుపేట : ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నం చాముండేశ్వరిదేవి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలుగా స్థానికులు కొండూరు సురారెడ్డి, పద్మావతి దంపతులు వ్యవహరించారు.

శేషజీవితం హాయిగా గడపాలి



ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది శేషజీవితం హాయిగా గడపాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులు, మృతి చెందిన హోంగార్డుల కుటుంబ సభ్యులకు నగదు చెక్కులను సోమవారం ఎస్పీ అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన పీ రమణమ్మకు రూ.76,255, షేక్ మస్తాన్‌కు రూ.76,230, వీ చిట్టిబాబుకు రూ.77,700, సీహెచ్ మునికాంతమ్మకు రూ.77,775, డీ సత్యనారాయణకు రూ.79,170, ఎస్. వెంకటశేషయ్యకు రూ.19,850, టీ విజయలక్ష్మికి రూ.21,315, కే వెంకటేశ్వరరావుకు రూ.21,315 నగదు చెక్కులను అందజేశారు. మృతి చెందిన హోంగార్డులు శ్రీనివాసులు, ఎం వెంకయ్య, జీ వెంకటరమణ, షేక్ అమీర్‌బాషా, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ వాసుదేవరావు, ఆర్ శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు నగదు చెక్కులు అందజేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఏఎస్పీ డీ హిమవతి, హోంగార్డు డీఎస్పీ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్ల అరెస్ట్‌పై నిరసన



నిరసన ప్రదర్శన చేపడుతున్న స్త్రీ విముక్తి సంఘటన నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఢిల్లీలో మహిళా రెజ్లర్ల అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్‌లో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి కొండమ్మ మాట్లాడుతూ తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆల్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌శరణ్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలని ఆందోళన చేపడుతున్న మహిళా రెజ్లర్లను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. బాధితులు జైళ్లలో, నిందితులు పార్లమెంట్‌లో ఉండడం సిగ్గు చేటని విమర్శించారు. దేశానికి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లు, వారికి మద్దతుగా నిలిచిన క్రీడాకారులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్నితాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ ఎంపీను వెంటనే అరెస్ట్ చేసి మహిళా రెజ్లర్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సునీత, స్త్రీ విముక్తి సంఘటన నగరనాయకులు భువనేశ్వరి, ముత్తు రమణమ్మ, అనూష, తదితరులు పాల్గొన్నారు.

రూ.28.13కోట్ల డిపాజిట్ల సేకరణ



వీసీబీ మహాజన సభలో మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు నెల్లూరు శాఖ 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.28.13 కోట్ల డిపాజిట్లను సేకరించిందని ఆ బ్యాంకు డైరెక్టర్ జీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని శ్రీ సుమంగళి కల్యాణ మండపంలో బ్యాంక్ మహాజన సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రూ.5కోట్లు అధికంగా డిపాజిట్లను సేకరించామని తెలిపారు. బ్యాంకు వైస్‌చైర్మన్లు ముదివర్తి రాఘవరావు, సత్యనారాయణ మాట్లాడుతూ నగరంలోని బ్యాంకు బ్రాంచ్‌ను పది వసంతాలు పూర్తిచేసుకుందన్నారు. 1,123 మంది సభ్యులు కలిగిన బ్యాంకు రూ.1.88 కోట్ల షేర్ ధనాన్ని కలిగి ఉందన్నారు. ఖాతాదారులకు రూ.33 కోట్లు రుణాలను అందించినట్లు తెలిపారు. రుణాలు సకాలంలో చెల్లించిన వారికి 4 శాతం నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నామన్నారు. బ్యాంకు ఖాతాదారులు, సభ్యులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా వీసీబీ పనిచేస్తోందని పేర్కొన్నారు. బ్యాంకు డైరెక్టర్లు నారాయణ స్వామి, సీహెచ్ కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ వెంకటేష్, బ్రాంచ్ మేనేజర్ టీఆర్కేవీ శర్మ, తదితరులు పాల్గొన్నారు.